క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో విద్యుత్ అంతరాయం కలుగుతుందని పట్టణ విద్యుత్ శాఖ ఏఈ డి.పవన్‌కుమార్ బుధవారం తెలిపారు. జానపాడు రోడ్డులో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని, పట్టణ ప్రజలు గమనించి సహకరించాలని ఏఈ తెలిపారు.

7 నుంచి మాచర్ల నియోజక వర్గ స్థాయి క్రికెట్ పోటీలు

దుర్గి: మండల కేంద్రమైన దుర్గిలో కొలువై ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 70వ వార్షికోత్సవం సందర్భంగా వంగ వీటి రంగా యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు చింతా రామకృష్ణ తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో పోటీలు నిర్వహిస్తామని, మొదటి బహుమతిగా రూ.20,116 వెలిదండి రాము, 2వ బహుమతి రూ.15,116ను వెలిదండి ఉమాగోపాల్ యూత్, 3వ బహుమతి రూ.10,116ను మాజీ లైన్ ఇన్‌స్పెక్టర్ వెలిదండి గోపాల్ అందజేస్తారని తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులు నియోజకవర్గానికి చెందిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ నెల 6వ తేదీ లోపు రిజిస్ట్రేషన్లు నమోదు చేసుకోవచ్చునని, సంబంధిత వివరాల కోసం రవి 9908801474, నరేష్ 9154494728లను సంప్రదించాలని కోరారు.

రూ.3వేలకు పెన్షన్ పెంపు.. కొత్తగా 182 మందికి

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.250లు పెంచి రూ.3వేలను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీపీ ఏచూరి సునీత సాయిశంకర్, ఎంపీడీఓ కె.సమతావాణిలు పేర్కొన్నారు. బుధవారం ఎంపీపీ ఏచూరి సునీత సాయిశంకర్ విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఏటా రూ.250 పెంచుతూ ప్రస్తుతం రూ.3వేలు అందజేస్తున్నారన్నారు. మండలంలోని వివిధ సచివాలయాలలో 182 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అడిగొప్పల 30, ఆత్మకూరు 15, దుర్గి 25, ధర్మవరం 20, పోలేపల్లి 28, ఓబులేశునిపల్లె 30, ముటుకూరు 25, కోలగుట్ల 9 పింఛన్‌లు నేటి నుంచి 8వ తేదీ వరకు స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు చేతుల మీదుగా పంపిణీ చేయటానికి ఏర్పాట్లు చేశారు.

విలువలతో కూడిన విద్యనభ్యసించాలి



మాచర్ల రూరల్: శారదామాత ఆశయాలైన త్యాగము, సేవా, భక్తి మార్గాలను ఆచరించాలని రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి కోరారు. బుధవారం మండలంలోని కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శారదామాత 171వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే విలువలతో కూడిన ఆశయాలను అవలంబించుకొని త్యాగం, సేవా మార్గాలను ఎంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రామకృష్ణ పరమహంస, శారదాదేవికి చెందిన పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఆర్.విజయకుమారి, అబ్దుల్ జబ్బార్, ఉపాధ్యాయులు ప్రసాద్, రామచంద్రమోహన్, హనిమిరెడ్డి, సైదమ్మ, ప్రభావతి, రజని, రాఘవయ్య, వెంకటేశ్వర్లు, సమితి సభ్యులు, మహేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం ముత్యాల పాపిరెడ్డి, రవి పాల్గొన్నారు.

నేడు ముటుకూరులో గాలికుంటు వ్యాధి టీకాలు

వెటర్నరీ డాక్టర్ నాగవల్లి




దుర్గి: మండలంలోని ముటుకూరు పశువైద్యశాలలో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెటర్నరీ డాక్టర్ నాగవల్లి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ గేదెలకు తీవ్రమైన జ్వరం, కొద్దిపాటి ఎండకు రొప్పటం, పశువులు, సూడు పశువులలో ఈసుకుపోవటం, ఎద్దులలో పని సామర్థ్యం తగ్గటం వంటి లక్షణాలు ఉన్న పశువులను వైద్యశాలకు తీసుకొచ్చి టీకాలను వేయించాలని రైతులను, పశుపోషకులను కోరారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మాచర్ల రూరల్: ఆటో, ద్విచక్ర వాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన కంభంపాడు గ్రామం వద్ద బుధవారం చోటు చేసుకుంది. రెంటచింతల గ్రామానికి చెందిన తిక్కా కోటేశ్వరరావు (45) ద్విచక్ర వాహనంపై కంభంపాడు గ్రామం వద్దకు చేరుకోగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో కోటేశ్వరరావు రోడ్డుపై పడగా తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు రూరల్ ఎస్‌ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దట్టంగా పొగమంచు


రైలుపట్టాలపై దట్టంగా కమ్ముకున్న మంచు


నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద


అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిలో..

రహదారులను మంచు కమ్మేసింది. బుధవారం తెల్లవారుజాము నుంచి మంచు అధికంగా కురుస్తుండటంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. రైల్వే ట్రాక్, హైవేలపై మంచు దట్టంగా కమ్ముకోవటంతో ఉదయం 9గంటల సమయంలో కూడా వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. పట్టణంలో వారం రోజులుగా మంచు వెంటాడుతుంది. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు విపరీతంగా మంచు కమ్మేస్తుంది. వాకింగ్‌కు వెళ్లేవారు, వాహనదారులకు ఇబ్బంది కలుగుతుంది. విద్యార్థులు సైతం పాఠశాలలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. మాచర్ల పట్టణమంతా మంచు ముంచెత్తింది.

దాచేపల్లి /మాచర్ల


మంచుతో కమ్ముకున్న మాచర్ల పట్టణం

జోరుగా హుషారుగా ఆడుదాం ఆంధ్రా

- ఆడుదాం ఆంధ్రాలో సత్తా చూపుతున్న ఆటగాళ్లు
- ఉత్సాహంగా, ఉల్లాసంగా ఆటలు ఆడుతున్న క్రీడాకారులు


కబడ్డీ ఆడుతున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి


ఖోఖో ఆడుతున్న యువతులు

రెంటచింతల: స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు జోరుగా హుషారుగా జరుగుతున్నాయి. రాష్ట్రంలోని మారుమూల పల్లె ప్రాంతాలలోని యువతలో దాగిన ప్రతిభను గుర్తించి వారిని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో యువత, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. గ్రామాలలో ఎంతో మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఇప్పటి వరకు ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించిన దాఖలాలు లేకపోవడంతో యువతలో ఒక్కసారిగా ఉత్సాహం ఉరకలేసింది. పల్లెల్లో ప్రతిభ కలిగిన యువకులను గుర్తించి వారిని అన్ని విధాల ప్రోత్సహించి మంచి నైపుణ్యం కల్గిన క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి సీఎం జగన్ ఆడుదాం ఆంధ్రా ప్రారంభించడం పట్ల అన్ని వర్గాల నుంచి హర్షం వ్యక్తం అవుతుంది. ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్ల ముత్తయ్య క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలను ప్రారంభించి యువకులతో కలిసి పోటీలలో పాల్గొని వారిని ఉత్సాహపరిచారు. రెంటాల, రెంటచింతల-2 సచివాలయాల పరిధిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ ఆడించగా హోరాహోరీగా జరిగిన పోటీలలో విజయం సాధించిన జట్లు మండల స్థాయి పోటీలలో పాల్గొంటారని పీఈటీ కత్తి రవి తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, కార్యదర్శి సోమేశ్వరరావు, పీఈటీలు బ్రహ్మం, కళ్యాణి, సుభాని, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటుతున్న ఖేల్ రత్నాలు

దాచేపల్లి : ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో క్రీడాకారులు దుమ్మురేపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా క్రీడాకారులకు సువర్ణ అవకాశం ఇవ్వటంతో వారిలో దాగిఉన్న ప్రతిభను బయటకు తీస్తున్నారు. ఆటల పోటీల్లో పాల్గొనేందుకు దాచేపల్లి మండలంలో మొత్తం 3,252 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామ, వార్డు సచివాలయాలకు 1,710 టీషర్టులు, టోపీలను ప్రభుత్వం అందజేసింది. ఈ ఆటల పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటూ సత్తా చూపుతున్నారు.

క్రీడాకారులకు సువర్ణ అవకాశం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలు క్రీడాకారులకు ఎంతో దోహదపడుతున్నాయి. ఇప్పటి వరకు గత ప్రభుత్వాలు క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఎటువంటి ఆటల పోటీలు నిర్వహించని పరిస్థితులు ఉన్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాకారుల్లోని ప్రతిభను ప్రపంచానికి తెలియజేసేందుకు ఈ బృహత్తర కార్యక్రమానికి రూపకల్పన చేసి అమలు చేస్తున్నారు. 15 సంవత్సరాల వయస్సు దాటిన యువతీ, యువకులు, విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొంటున్నారు. క్రీడా పరికరాలు ప్రభుత్వమే అందజేయటంతో క్రీడాకారులు పోటీల్లో ప్రతిభ చూపుతున్నారు. ఖోఖో, వాలీబాల్, క్రికెట్, కబడ్డీ పోటీలు హోరాహోరీగా స్నేహపూరిత వాతావరణంలో ఉత్కంఠంగా సాగుతున్నాయి. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు జరుగుతున్నాయి..

ఓ అద్భుత అవకాశం ఆడుదాం ఆంధ్రా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి భారీ స్థాయిలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటి వరకు గుర్తింపుకు నోచుకోని క్రీడాకారులకు ఓ అద్భుత అవకాశం. ఈ పోటీలలో మా ప్రతిభను ప్రదర్శించి నైపుణ్యం పెంపొందించుకొని రాష్ట్ర స్థాయిలో విశేషంగా రాణించేందుకు కృషి చేస్తాం.

షేక్ మహ్మద్ రఫీ,
క్రికెట్ క్రీడాకారుడు, రెంటచింతల

క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి వస్తుంది..



పల్లెల్లో మరుగునపడిన క్రీడాకారుల ప్రతిభ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా వెలుగులోకి వస్తుంది. సీఎం జగన్ యువతను క్రీడలలో ప్రోత్సహించడానికి ప్రారంభించిన ఎంతో మంచి కార్యక్రమం ఇది. ఎన్నో మెలకువలు తెలుసుకుని ఆటను మెరుగుపరుచుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కసారిగా పెద్ద ఎత్తున క్రీడా సంబరాలను ప్రారంభించిన సీఎం జగన్‌కు యువత ఎప్పుడూ అండగా ఉంటుంది.

మామిడి దేవదానం,
వాలీబాల్ క్రీడాకారుడు, రెంటచింతల

ప్రభుత్వం సువర్ణ అవకాశం కల్పించింది..



ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రా ద్వారా ప్రభుత్వం సువర్ణ అవకాశం కల్పించింది. ఈ పోటీల్లో నేను షటిల్ ఆడుతున్నాను. చాలా సంతోషంగా ఈ పోటీల్లో పాల్గొని షటిల్ హోరాహోరీగా ఆడుతున్నాను. రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి కార్యక్రమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టి నాలాంటి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు.

ఆలేటి రాజేష్,
షటిల్ క్రీడాకారుడు

జగనన్న ఆరోగ్య సురక్ష ..పేదలకు రక్ష

నగర పంచాయతీ చైర్మన్ పోలు, వైస్ ఎంపీపీ వేముల


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు


ఓపీకి బారులు తీరిన ప్రజలు

గురజాల : జగనన్న ఆరోగ్య సురక్ష నిరుపేదలకు రక్ష అని నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మచలమయ్యలు అన్నారు. గురజాలలోని సచివాలయంలో, మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి పేదవాడికి కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పాలన అందించడం జరుగుతుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతో మంది వృద్ధులు వైద్యసేవలు పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మన్నెం కన్యాకుమారిప్రసాద్, కౌన్సిలర్లు కుక్కముడి అనిల్‌కుమార్, వై నారాయణ, చర్లగుడిపాడు గ్రామ సర్పంచ్ బత్తుల ప్రసాద్, సీనియర్ నాయకుడు కావూరి అంజిబాబు, మాజీ సర్పంచ్ పోట్ల నారాయణ, ముక్కటం, పోటు సాంబయ్య, బండ్ల సాంబశివరావు, డి.మణిదీప్, అనిల్ తదితరులున్నారు.

ప్రజారోగ్యమే జగనన్న లక్ష్యం

పిడుగురాళ్ల: ప్రజా ఆరోగ్యమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి అన్నారు. పట్టణంలోని బాబు జగ్జీవన్‌రావ్ మిలటరీ కాలనీలోని 10వ సచివాలయం పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరోగ్యం బాగుండాలని ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం చేపట్టటం జరిగిందన్నారు. ఇద్దరు సూపర్ స్పెషలిస్ట్ వైద్యులు, మరో ఇద్దరు జనరల్ వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 214 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు వైద్యులు అనిల్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు కత్తెరపు వాసుదేవరెడ్డి, పసుపులేటి ఆనంద్‌బాబు, మార్కెట్ యార్డు డైరెక్టర్ స్వామి, అనిల్, స్త్రీ సంబంధిత వైద్యురాలు సుష్మారెడ్డి, ఎం.ఫణికుమార్, వైఎస్ ఆంజనేయులుతోపాటు ఆరోగ్య సిబ్బంది, సచివాలయ అడ్మిన్ తేజ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో సాంకేతిక విప్లవం

ఎంపీపీ చౌడేశ్వరి


ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో ఎంపీపీ చౌడేశ్వరి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, సర్పంచ్

రెంటాల(రెంటచింతల): విద్యావ్యవస్థలో నూతన విద్యా విధానం అమలుచేసి సాంకేతిక విప్లవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికినట్లు ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. బుధవారం మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఆమె జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ సీహెచ్ కిరణ్‌కుమార్‌తో కలిసి ట్యాబ్‌లను పంపిణీ చేసి మాట్లాడారు. సీఎం జగన్ తన పాలనలో విద్యార్థులకు డిజిటల్ తరగతులు నిర్వహించడం ద్వారా జీవన నైపుణ్యాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో కూడా సాంకేతిక విద్యను అందించడంలో భాగంగా ట్యాబ్‌లను 8వ తరగతి విద్యార్థులందరికీ ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో నాడు-నేడు ద్వారా కోట్ల రూపాయలతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. విద్య ద్వారానే ప్రతి పేద కుటుంబం అభివృద్ధి చెందుతుందని భావించిన సీఎం జగన్ అనేక పథకాలను అమలుచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఓర్సు సాగరుబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

మాచర్ల: భారతదేశంలో మొట్టమొదటిసారిగా మహిళా ఉపాధ్యాయురాలుగా ఎంపికై సమాజ సేవలో ఎంతో కృషి చేసిన సావిత్రిబాయి సేవలను కొనియాడుతూ పలు సంఘాల నాయకులు మాట్లాడారు. బుధవారం పట్టణంలోని రోప్‌వే కాలనీలోని ప్రభుత్వ ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం పండిట్ విజయలక్ష్మి మాట్లాడుతూ సావిత్రిబాయి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు, మహిళా అధ్యక్షురాలు మేడా వెంకటలక్ష్మి, వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, ఆర్యవైశ్య మహిళా మండలి జిల్లా కార్యదర్శి పరిటాల ధనలక్ష్మి, కార్యదర్శి పందిరి నరసింహారావు ఆధ్వర్యంలో ఉత్తమ బోధ చేస్తున్న శాంతిబాయి, సుమతి, ఆశాలత, పండిట్ విజయలక్ష్మికి సన్మానం చేశారు.

ఆర్యవైశ్యులకు వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం

ఏపీఈడబ్ల్యూఐడీసీ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు చింతా వెంకట రామారావు



పిడుగురాళ్ల: ఆర్యవైశ్యులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే సముచిత స్థానం దక్కిందని ఏపీఈడబ్ల్యూఐడీసీ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు చింతా వెంకట రామారావు తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు గతంలో ఎన్నడు లేని విధంగా ఎంతో గౌరవం దక్కిందన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా గతంలో కన్నా ఎక్కువ సంతృప్తి కరంగా ఆర్యవైశ్యులు ఉన్నారన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆర్యవైశ్య నాయకుడు సరదాగా నమస్కరించిన సన్నివేశాన్ని అపార్థం చేసుకొని టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు ఏదో తీరని ద్రోహం జరుగుతున్నట్లు, అవమానం జరుగుతున్నట్లు ఊహాగానాలు సృష్టించి సోషల్ మీడియాలో హల్‌చల్ చేయటం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో ఆర్యవైశ్యులు ఎంతో భయంకరమైన పరిస్థితులు అనుభవించారని గుర్తు చేశారు. మాచర్ల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, చిలకలూరిపేట, బాపట్ల, నరసరావుపేట మున్సిపాలిటీలో ఆర్యవైశ్యులు అనేక సందర్భాలలో ఆర్థికంగా నష్టపోవటంతోపాటు ప్రాణాలను కూడా కోల్పోయారని రామారావు ఈ సందర్భంగా గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆర్యవైశ్యులకు గురజాల నియోజవకర్గంలో ప్రత్యేక స్థానం కల్పించారన్నారు. ప్రతి ఆర్యవైశ్యుడు భవిష్యత్‌లో జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసే వరకు నిరంతరం కృషి చేస్తారని ఆయన తెలిపారు.

7న విజయవాడలో గిరిజన శంఖారావం



మాచర్ల: రాష్ట్రంలో గిరిజన ప్రజా సమైక్య, గిరిజన విద్యార్థి సమైక్య గిరిజన శంఖారావం ఈ నెల 7వ తేదీన విజయవాడలో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించి నాయకులు పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూన్సావత్ రంగానాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించి విజయవాడ తరలి రావాలన్నారు. పోస్టర్లు ఆవిష్కరించిన వారిలో లచ్చునాయక్, నాయక్, శ్రీనునాయక్, డి.నాయక్, వి.మోహన్‌నాయక్, లాలూనాయక్, ఎం.నాగేశ్వరరావునాయక్, బాలునాయక్, రామూనాయక్ తదితరులున్నారు.

లక్ష్మీనరసింహస్వామి యజ్ఞం

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని ఉట్లస్తంబాల సెంటర్లో నున్న రామకృష్ణ సేవామండలిలో బుధవారం వేదపండితులు గండికోట విజయ్ మోహన్‌కుమార్ శర్మ నేతృత్వంలో బుధవారం లక్ష్మీనరసింహస్వామివారి యజ్ఞం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సేవా మండలి అధ్యక్షులు గుంటక కాశిరెడ్డి, సభ్యులు పల్చూరి రామారావు, నాళం పెదబాబు, కె.సైదులు, గ్రామస్తుల సహకారంతో ఈ యజ్ఞం జరిపించారు.

రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయం


బెంచీలు అందజేస్తున్న కేసీపీ జీఎం వి.వెంకటరమణ, సభ్యులు

మాచర్ల: విద్యాభివృద్ధి నిమిత్తం రోటరీ క్లబ్, మాచర్ల, రోటరీ క్లబ్ ఆఫ్ డెక్కన్ వారి ఆధ్వర్యంలో రూ.1.50లక్షల విలువైన బెంచీలు, కుర్చీలను పట్టణంలోని సెయింటాన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాలకు కేసీపీ జనరల్ మేనేజర్ వి.వెంకటరమణ ఆధ్వర్యంలో అందజేశారు. బుధవారం సెయింటాన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాలకు చెందిన రోటరీ క్లబ్, మాచర్ల వారు సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు డాక్టర్ రామకోటయ్య, చైర్మన్ త్రిపురనేని మురళి, అసిస్టెంట్ గవర్నర్ ఇక్కుర్తి శంకర్, కార్యదర్శి పఠాన్ నాగూర్‌వలిలు రోటరీ క్లబ్ సేవల గురించి వివరించారు. ప్రతి ఏడాది వెనుకబడిన మాచర్లలో విద్యా, వైద్యం, మంచినీటి సౌకర్యానికి లక్షలు రూపాయలు ఖర్చు చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చిన్ని సత్యనారాయణ, కోశాధికారి పందిరి నరసింహారావు, మహిళా ప్రెసిడెంట్ కొండవీటి కృష్ణకుమారి, కార్యదర్శి నిమ్మగడ్డ సురేఖ, జాగృతి, ఆర్గనైజింగ్ మెంబర్లు చెరుకూరి నరసింహారావు, చందోలు నాగేశ్వరరావు, పోలూరి శ్రీను, కర్నాటి వాసు, తుమ్మల ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, రామ్మూర్తి పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలు

ఈపూరు: మండలంలోని వనికుంట, చిట్టాపురం గ్రామాల్లో బుధవారం పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన అంగజాల సైదులు, గోపు భూలక్ష్మి, పోట్లూరి వీరాంజనేయులుకు చెందిన వరి పొలంలో పంట కోత ప్రయోగాలు నిర్వహించగా ఎకరానికి 28 బస్తాలపైనే దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అనంతరం పల్నాడు జిల్లా ఏడీ ఎస్.శ్రీనివాసరావు, మండల స్టాటిస్టికల్ ఆఫీసర్ కె.నాగశ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ పంటల దిగుబడి అంచనా కోసం పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతిఒక్కరూ పంట కోత ప్రయోగాలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ పర్యవేక్షణ అధికారి సీహెచ్ శ్రీను, గ్రామ వ్యవసాయ సహాయకులు కె. ఆనంద్‌బాబు, తిరుమల పాల్గొన్నారు.

హోమ్ గార్డుల ఐకమత్యం అభినందనీయం


హోంగార్డుకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: పదవీ విరమణ పొందిన హోంగార్డు జేవీఎస్ నాగేశ్వరరావుకు తోటి హోమ్‌గార్డులు అండగా నిలిచారు. హోమ్ గార్డులు అందరూ కలిసి ఒక రోజు వేతనం రూ.5,19,720 ఆర్థికసాయం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం చెక్కును జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి చేతుల మీదుగా నాగేశ్వరరావు స్వీకరించారు. తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ పదవి విరమణ చేసిన హోమ్‌గార్డుకు సాయం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చినందుకు అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ వై.రవికిరణ్ పాల్గొన్నారు.

మిరపలో సస్యరక్షణ చేపట్టాలి

గురజాల హెచ్ఓ మోహన్



రెంటచింతల: ప్రస్తుతం పల్నాడు ప్రాంతంలో మిరప కోత దశలో ఉండటంతో పలు తెగుళ్ల సోకే అవకాశం ఉందని ఉద్యానశాఖ అధికారుల సూచనలతో పంటను కాపాడుకోవడానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని గురజాల ఉద్యానశాఖ అధికారి వై.మోహన్ అన్నారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలలో మిరప పంట పొలాలను, మిర్చి పంటను ఆరబెట్టిన కల్లాలను ఆయన సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. కల్లాలలో ఎండుతున్న మిర్చిపంట మంచుపడితే కాయకుళ్ళు రావడానికి అవకాశం ఉందని ముందు జాగ్రత్త చర్యగా కాయలపై శిల్పాలిన్ పట్టాలను కప్పుకోవాలన్నారు. కోతకోసి పంట ఎండబెట్టేటప్పుడు కాయకుళ్ళు ఆశించిన కాయలను వేరు చేసి విడివిడిగా ఎండబెట్టుకోవాలని సూచించారు. ఆయన వెంట గ్రామ వ్యవసాయ సహాయకులు డి.శంకర్, దినేష్, రైతులున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ)
97053 46588 (మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com